# ధర్మదేవత గుడ్డికళ్ళు

"చస్తిన్రో! అయ్యో! అమ్మో! నీ జిమ్మడ నీకు పొయ్యేకాలం రాను!"

లచ్చి మొగుడి చేతిలోనుంచి జుట్టు విడిపించుకొనే ప్రయత్నం చేస్తూనే తిడుతోంది.

లచ్చి జుట్టు పట్టుకొని గభీగభీమని గుద్దుతున్నాడు సుబ్బన్న-షావుకారుపేటలో ఉన్న జయరాంశెట్టి మూడంతస్థుల మేడముందున్న పేవ్‌మెంటుమీద.

త్రోవనబోయే జనం చుట్టూ మూగారు!

పెద్దిరికానికి పేరుమోసిన పెద్దమనుష్యులు జనాన్ని తోసుకుంటూ ముందుకు పోయారు.

"ఒరేయ్! వదలవేమిరా దాన్ని?" గదమాయించాడు ఓ బుర్రమీసాల పెద్దమనిషి.

ఏదో మించిపోతున్నట్లు 'పళ్ళగంప' జనం ఒకర్నొకరు తోసుకుంటూ ముందుకొస్తున్నారు.

పేవ్‌మెంటుమీద సంసారం గడుపుతున్న సుబ్బన్నకు, తపీమని తలుపు ముయ్యడానికి మహారాజుల్లా వీల్లేదు కనక, లచ్చిని ఆపేవ్‌మెంటుమీదే వెల్లకిలా పడేట్టు ఓ తోపుతోసి, చుట్టూచేరిన గుంపును చూస్తూ, గొణుక్కుంటూ దిమ్మెదగ్గిరకుపోయి "టక్‌టక్"మని దబ్బనాన్ని కసిగా సాగకొడ్తున్నాడు సుత్తితో.

"ఎందుకురా దాన్ని కొడతావ్?" ఓ ఖద్దరుసిల్కు లాల్చీలో వున్న పెద్దమనిషి, అన్యాయపు అంతు తెలుసుకో వాలనే మనస్తత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రశ్నించాడు.

జారిపోయిన పమిటను సర్దుకోంటూ, క్రింది పెదవినుండి కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటూ, గోడకు ఆనుకూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తూంది లచ్చి.

దబ్బనం మొన సన్నగా సాగకొడ్తూ మధ్య మధ్య లచ్చివైపు చురచురా చూస్తున్నాడు సుబ్బడు.

ఎండ చిటపట లాడుతూంది. సుబ్బడి నొసటినుండి ఖర్మజలం కారుతూంది దిమ్మె మీదకు.

గుండ్రని ముఖం, ఎత్తయిన నున్నని బుగ్గలు, చామన చాయ, రక్తంతో ఎర్రబడ్డ పెదవులు, కొత్త అందాన్ని ఇస్తున్నాయి మంచి వయసులో వున్న లచ్చికి.

వయసులోవున్న అంత అందమైన ఆడది ఏడుస్తూ వుంటే చాలామందికి జాలివేసింది. తలోక రకంగా సానుభూతి చూపిస్తున్నారు.

"అసలెందుకే వాడు నిన్ను కొట్టింది?" జరీకండువాను సర్దుకుంటూ అడిగాడు లచ్చిని ఓ జలసారాయుడు.

"ఏంలేదు దొరా! పొద్దున్నుంచీ ఇట్టాగే సంపే త్తున్నాడు," అన్నది లచ్చి బెక్కుతూ.

"ఒసేయ్! ముయ్యేయ్ నోరు! అబద్ధం కూసేవంటే గొంతు పిసికేత్తా!"-చేతిలోని సుత్తి కిందపడేసి లేవబోయేడు సుబ్బడు.

"ఓరేయ్! ఆగరా!" అంటూ గుడ్లు ఉరిమేడు ఓ బుర్రమీసాల నాయుడు, సుబ్బడికి దగ్గిరగావచ్చి.

"కాద్దొరా? పొద్దున్నుంచీ సెబుతున్నా దొరా దానికి- సూదులూ - దబ్బనాలూ — ఎత్తికెల్లి బువ్వడక్కు- రమ్మని. నిన్న పొద్దునసంగ కూసంత గంజి తాగినా దొరా! ఆక లేత్తుంది. పోయిరావేమే అంటే కదల్దు! ఆ వజాన కూకుంది!" అన్నాడు సుబ్బడు.

"ఏమే" అంటూ నాయుడు లచ్చివైపు చూశాడు.

అందరూ లచ్చికేసే చూస్తున్నారు.

మళ్ళీ దిమ్మెముందు కూర్చున్నాడు సుబ్బడు.

"రాత్తిర్నించీ కాల్లూ, చేతులూ పీక్కు-పోతున్నయ్ దొరా! తల నొప్పేత్తుంది. ఈ సచ్చినోడు పొద్దున్నుంచీ చావతంతున్నాడు దొరా!" అంటూ లచ్చి బావురుమని ఏడవసాగింది.

లచ్చికి సానుభూతి చూపేవాళ్ళు ఎక్కు-వయ్యారు.

అప్పుడే వచ్చినవాళ్లు "అసలు సంగతేమిటి?" అంటూ పక్క-వాళ్ళను అడుగుతున్నారు కుతూహలంగా, ఏదో తమకు దొరక్కు-ండా మించిపోయినట్టు.

"ఒరేయ్ పశువా! వంట్లో బాగా లేనిదాన్ని అలా కొడ్తావట్రా?" ఖాదీ సిల్కు-లాల్చీ మందలించింది.

"అదొట్టి దొంగది దొరా! నిన్నొచ్చిన డబ్బులన్నీ రాత్తిరి కరుసు సేసింది. ఊళ్ళోకిపోయి సూదులు అమ్ముకు రావే అంటే మంకేసి కూకుంది దొరా! సోంబేరి ముండా!

అబద్ధాలు సెప్తావంటే ?'' అంటూ లచ్చి కేసి తీక్షణంగా చూశాడు సుబ్బడు.

''నాకియ్యలేదు దొరా! సత్తెపమాణంసేసి సెప్తుండా! డబ్బులన్నీ దేనికో ఇచ్చిండు. నన్ను ఆ వజాన సావ తంతుండు ! ఎప్పుడూ ఇట్టానే ఏదిత్తాడు! ఈడి సిరుసుపగల !'' లచ్చి తిట్టడం మొదలుపెట్టింది.

సుబ్బడికి వళ్ళు మండిపోతూంది. ఇక ఆగలేక పోయాడు.

ఒక్క దూకులో పోయి, తప్పించుకు పారిపోబోతున్న లచ్చి జుట్టు లంకించుకున్నాడు.

''తప్పుడు కూతలు కూత్తావంటే ?'' అంటూ వంగదీసి 'ధబీ ధబీ' బాదసాగాడు సుబ్బడు.

''వొరేయ్ ! వదులుదాన్ని! ఆగరా!''అంటూ ముందు వరసలో వున్నవాళ్ళంతా అడ్డం పోయారు సుబ్బడికి.

అంతలో మెడలమీదకు జుట్టుపెంచుకున్న ఓ యువ కుడు సుబ్బడి రెక్కపట్టుకొని ఒక్కలాగు లాగాడు. మరో ఇద్దరు ముగ్గురి సాయంతో సుబ్బణ్ణి వెనక్కు నెట్టుకెళ్ళాడు.

పట్టుకున్న వాళ్ళనుండి ఒక్క కుదుపుతో తనను వది లించుకున్నాడు సుబ్బడు.

లచ్చి స్వరం తారస్థాయిలో విన్పిస్తోంది. తిడుతూనే వుంది.

''తన్నండి వెధవను ! పొగరెక్కి చస్తున్నాడు.'' మీసాల నాయుడు రంకెలేశాడు.

''వొరేయ్ పశువా ! ఆడదానివంటిమీద చెయ్యి

వేస్తావంటారా ?" అన్నాడు గ్లాస్కో ధోవతిలో వున్న యువకుడు- చేతిలోవున్న "సంస్కృతి" పత్రికను సర్దుకుంటూ.

"మీకు తెలవదు దొరా! మీరెల్లండి. మీరుంటే అది అట్టాగే మంకేశం ఎత్తుద్ది!"- సుబ్బడు బుసకొడ్తూ అన్నాడు.

సుబ్బడి కళ్లు చింతనిప్పుల్లా కణకణ లాడుతున్నాయి. పెదవులు కసితో వంకర్లు తిరుగుతున్నాయి. పళ్లు బిగించి జనాన్ని తప్పుకొని లచ్చికేసి చూస్తున్నాడు.

"వొరేయ్ ఊతడవ దానివంటిమీద చెయ్యి పడిందా నీ వీపు చెడుతుంది. జాగ్రత్త!"- ఖద్దరు సిల్కులాల్చీ.

"మీ కేందశ! నా పెళ్లాన్ని నేను కొట్టుకుంట, సంపుకుంట, మీరెల్లిపొండి. మీ కెందుకు? చుట్టూ చేరిన పెద్ద మనుష్యుల్ని వళ్లుతెలియని కోపంతో కసురుకున్నాడు సుబ్బడు.

"ఒరేయ్ నీ పెళ్లాన్ని కొడ్తే ఊరుకుంటామట్రా"
—"సంస్కృతి" పేపరు.

"ఆ! ఏం పొగ్రరా!"- నాయుడి మీసాలు.

"మనం అంతా పోతే ఇవ్వాళ వీడు దాన్ని బతకనివ్వడు"-చీలమండ లంటుకోటానికి ప్రయత్నిస్తున్న ఎం. ఎస్. 55. చొక్కా - ఆంధ్ర విద్యార్థిలా వున్నాడు

"వీడి తిక్క ఇలా కుదర్దు లే! ఖద్దరు లాల్చీ, మీసాల నాయుడి చెవులో గుసగుస లాడింది.

జనం వాళ్లిద్దరి వైపూ చూస్తున్నారు కుతూహలంతో.

ఇంటిముందు జరుగుతున్న గందర గోళానికి, రూపాయి విలువ తగ్గింపును గురించి పత్రికలో చదివి, బంగారు వస్తువు

లేమీ అమ్మవద్దని గుమస్తాతో చెబుతున్న జయరాం శెట్టి కంగారు తిన్నాడు. మొదటి అంతస్థు వరండాలో నిల్చుని కింద గుమికూడిన జనాన్ని చూడసాగాడు. కిందకు వెళ్ళిన గుమాస్తా తిరిగొచ్చి విషయం వివరించాడు. దాంతో శెట్టి గారు రిలీఫ్‌గా గాలి పీల్చుకున్నాడు.

ఫోన్ దగ్గరకెళ్ళి డయల్ చేశాడు జయరాం శెట్టి పోలీసు స్టేషన్‌కు.

"హల్లో.... ఆఁ నేను! జయరాం శెట్టి.... ఇక్కడ.... అదే మా ఇంటిముందు కొట్లాట జరుగుతూంది....తొందరగా- వెంటనే రావాలి ... అర్జెంటు....థ్యాంక్సు-" ఫోన్ పెట్టేసి మళ్ళీ వరండాలోకి వెళ్ళి నిలబడ్డాడు.

"పోనియండీ మన కెందుకూ? వాళ్ళగొడవ వాళ్ళు పడతారు!" అన్నాడు ఒక ముసలాయన జనంలోనుండి తప్పుకొని వెళ్తూ.

"మా బాగా చెప్పావయ్యా! కళ్ళ ముందు ఇంత ఘోరం జరుగుతూవుంటే చూస్తూ ఊరుకోమంటావా?" అందుకున్నాడు ఓ పెద్ద మనిషి.

"ఘోరమంట ఘోరం! అందరిళ్ళలో జరిగే ఘోరమంతా నో?" విసురుగా అన్నాడు ముసలాయన.

"ఏంటా ముసలిపీనుగ సణుగుడు! నోరు ముయ్యవయ్యా?" అందరూ తలొక మాటంటూ-ముసలాయన నోరు మూయించారు.

లచ్చి కొంచెం శృతి తగ్గించి బెదురుగా జనం కేసి చూస్తూంది.

సుబ్బడు తన సామాన్లు సర్దుకుంటూ ఏమేమో తిట్టు కుంటున్నాడు.

ఆ తిట్లలో భాగం లచ్చితోపాటు జనానికికూడా లేక పోలేదు.

అంతలో పోలీసు ఇన్‌స్పెక్టరు నలుగురు కాన్‌స్టేబు ల్సతో వచ్చాడు.

పోలీసు లాఠీలతో జనాన్ని సర్దుతున్నారు.

"ఏమిటీ న్యూసెన్స ?" సబ్ ఇన్‌స్పెక్టరు హేట్ సర్దు కుంటూ అన్నాడు.

"ఇదుగో వీడే దొంగ వెధవ దాన్ని చంపేస్తున్నాడు." సుబ్బడ్నీ, లచ్చినీ చూపిస్తూ అన్నాడు నాయుడు మీసాలు తిప్పుకుంటూ.

"మేము అడ్డం రాకపోతే ఈపాటికి దాని ప్రాణాలు తీసేసివుండేవాడు. వెధవ!" ఖద్దరు సిల్కు లాల్చీ తాలుకు పెద్దమనిషి అన్నాడు.

భయంతో వణికిపోతూ, మోకాళ్ళమీద జారబడి "లేద్దొరా! మీ కాళ్ళకు మొక్కుతా" అంటూ చేతులు జోడించిన సుబ్బడి గుండెలమీద ఇనస్పెక్టర్ బూటునాడాలు నాట్యం చేశాయి.

వెల్లికితలా పడ్డ సుబ్బడ్ని రెండు రెక్కలూ పట్టుకొని గుంజి నిల్చోబెట్టారు ఇద్దరు పోలీసులు.

లచ్చి పెద్ద పెట్టున ఏడుస్తూ ఇన్‌స్పెక్టరు కాళ్ళమీద పడింది.

"ఊరుకోండి దొరా! వాడేమీ సెయ్యలేదు. నేనే తప్పు చేసినా!" వణుకుతూ, ఏడుస్తూ, అన్నది లచ్చి.

ఇన్‌స్పెక్టర్ కాళ్ళమీద పడబోతున్న సుబ్బడ్ని పోలీసులు 'వేన్' దగ్గిరకు లాక్కెళ్ళారు.

లచ్చి సుడిగాలిలా వెళ్ళి సుబ్బడ్ని కౌగలించుకుంది.

"వదలండి బాబూ! మీ కాళ్లకు మొక్కుతా!" ఏడుస్తూ ప్రాథేయపడింది లచ్చి.

లచ్చిని బలవంతంగా నెట్టి పోలీసులు సుబ్బడ్ని వేన్ ఎక్కించారు.

కాళ్ళమీదపడ్డ లచ్చిని వదిలించి, శెట్టిగారి దగ్గర శెలవు తీసుకొని అధికారి వేన్‌లో ఎక్కాడు.

లచ్చి తల బాదుకుంటూ లబోదిబోమని ఏడుస్తూవుంటే బుర్రమీసాలూ, గ్లాస్కో పంచెలూ ఎగాదిగా చూస్తున్నాయి గుడ్లు మిటకరించి.

వేన్ సాగిపోతూవుంటే లచ్చి ఏడుస్తూ దానివెంట పరిగెత్తుతూంది.

జనం ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"హు! అలగా జనం! ఎంత చేస్తేనేం? నీతా జాతా! అది చూడుమరి!" ఖాదీసిల్కులాల్చీ ఆయన ఆముదం తాగినట్టు ముఖం పెట్టి అన్నాడు.

"ఓస్! దీని తస్సాగొయ్యా!" నాయుడు చిత్తై మీసం పీక్కుంటూ జనంలో నుంచి బయట పడ్డాడు.

"పేదాళ్ళ సంసారం పెద్దోళ్ళకు లోకువ. పేదోళ్ళకు మాత్రం ప్రేమలుండవూ?" అందుకున్నాడు ముసలాయన.

"ఎందు కుండవూ ! వుంటాయి !" వెటకారంగా అన్నాడు నాయుడు.

"రామరాజ్యంలో జాంబవంతుని న్యాయం" కాండ్రించి ఊశాడు ముసలాయన వేన్ వెనకే పరుగుతీస్తున్న లచ్చిని జాలిగా చూస్తూ.

* * *

సుబ్బన్నను ఇరవైనాలుగు గంటలు రిమాండ్‌లో వుంచారు. ఆ రాత్రి సుబ్బన్న వున్న జైల్‌లో మరో ఖైదీని పెట్టారు. తలకు కట్టుకట్టివుంది. ముఖంమీద రక్తం గడ్డకట్టిన చారలు ఇంకా వున్నాయ్. పాలిపోయిన శరీరం. చాలా నీరసంగా కన్పిస్తున్నాడు. కళ్ళలో ఏదో ప్రత్యేకత కన్పిస్తూంది. గోడకు చేరబడి నీరసంగా కూర్చుని వున్నాడు.

ఆ వ్యక్తిని చూడగానే శరీరం గగురు పొడిచింది, సుబ్బన్నకు.

కొంచెంసేపు కన్నార్పకుండా చూసి "ఓరు బాబూ మీరు!" అడిగాడు సుబ్బన్న.

సుబ్బడివంక ఓ క్షణం చూశాడు.

"ఇవ్వాల్టినుంచి చచ్చేంతవరకూ ఖైదీని," అన్నాడు ఆ వ్యక్తి అదోలా నవ్వుతూ.

సుబ్బడు నివ్వెరపోయి చూశాడు. ఈ దొర ఖూనీ చేశాడా? అట్టా కన్పించడంలేదే?

"అంటే ఖూనీకేసా బాబూ ?"

"కాదు." నిర్లిప్తంగా వుంది ఆ యువకుని కంఠం.

"దొంగతనమా దొరా?"

"ఊహూ! అదీ కాదు."

దొంగతనం కాదు. ఖూనీ కాదు. మరేమిటో? సుబ్బడు ఆలోచనలో పడ్డాడు. కాని ఎంత ఆలోచించినా కొస దొరకలేదు.

"అయితే నేరం ఏంది బాబూ?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బడు.

"మనిషి-మనిషిగా బతకాలనీ, మనిషికీ-జంతువుకూ భేదం వుందనీ-మనిషి కుక్కలా బతకూడదనీ నమ్మాను."

"అదేంది బాబూ?"

అయోమయంగా వుంది సుబ్బడికి.

"చిన్న మెత్తు ముక్కపోగు కోసం మనిషి పసిబిడ్డ గొంతు నులపకూడదన్నాను. కడుపు కక్కుర్తికోసం మన అక్కచెల్లెళ్లు శీలం అమ్ముకోకూడదన్నాను."

"ఏదో అంతేనే జైల్లో పెట్టారా బాబూ!" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు సుబ్బన్న.

"నగ్నంగా...."

"అంటే?"

"గుడ్డలు లేకుండా వందలకొలది తోటివాళ్ళతో, స్త్రీల ముందు నుంచోటాన్ని వ్యతిరేకిస్తూ నాలోని మానవత్వం స్పృహ వున్నదాకా తిరుగుబాటు చేసింది. ఓ క్షణం ఆగి "తెలిసిందా నేను చేసిన నేరం?" ఉద్రేకంతో అన్నాడు.

"ఎంతన్యాయం బాబూ ! ఆళ్ళ కళ్లు పోతాయి బాబూ !"

సుబ్బడికి ఆ యువకుడు చెప్పిందేమిటో అర్థం కాక పోయినా ఎక్కడో అన్యాయం వుందని అర్థం అయింది.

"అదిసరే! నువ్వెందు కొచ్చావ్ ? దొంగతనం చేశావా ?" అడిగాడు ఆ యువకుడు.

"లేదు బాబూ !"

"మరి ?"

"ఏం లేదు దొరా ! మా ఆడదీ నేను కూ త్తెకీచు లాడుకున్నాం. ఆవజాన దానికి రెండు తగలినిచ్చాను. దోవన బోయే ఆళ్లూ-ఈళ్ళూ చేరి పెద్దయాగీ చేసింగ్రు దొరా! పోలీసాళ్ళకు పట్టిచ్చింగ్రడె దొరా"

"కొట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది?" అడిగాడు ఆ యువకుడు.

"అది శానా గడుసుది దొరా ? పన్లోకి పోయే అంటే, ఒంటో ఉసుర్లేదని మొరాయించింది దొరా !" అన్నాడు సుబ్బడు.

"అంతమాత్రానికే కొడ్తావా ? నిజంగానే సుస్తీగా వుందేమో ? నీ కసి దానిమీద చూపిస్తే ప్రయోజనం ఏమిటి ?

ఓ క్షణం ఆగి మళ్ళీ ఆవేశంగా అన్నాడు—

"జబ్బులోవుండి పనిచెయ్యలేని స్థితిలో వున్నా, రెక్కలు ముక్కలు అయ్యేట్టు చాకిరీ చేస్తేగాని పొట్టనిండని పరిస్థితులమీద నీ కసి తీర్చుకో! నీ ఆకలి మంటలకు నీతో

పాటు జ్వలిస్తున్న నీభార్య ఎరకాకూడదు. నీలాగే కష్టించి పనిచేసే నీ పక్కవాడిమీద నీ కసి చూపించకూడదు. పొద్దస్తమానం ఎముకలు పిండి మూలుగు ధారపోసినా.... అర్ధాకలితో అలమటించాల్సిన పరిస్థితు లేమిటో తెలుసుకో. ఆ పరిస్థితులను మార్చడానికి ప్రయత్నించు. నీ ప్రయత్నానికి అడ్డం వచ్చినవాళ్ళమీద చూపించు నీ కసి .... ....

"ఏయ్! జైల్లోకూడా మొదలుపెట్టావ్?" జైలు వార్డరు దగ్గరకి వస్తూ అన్నాడు.

సుబ్బన్న ఏదో చెప్పాలనుకున్నాడు. కాని ఏం చెప్పాలో తెలియడంలేదు స్పష్టంగా.

"వీళ్ళకూడా నూరి పోస్తున్నావా? నీపని ఇట్లాకాదు లే పద!" వార్డరు ఖైదీని పక్కగదిలోకి తీసికొనిపోయాడు.

"ఇదిగో ఇక ఆమెను ఎప్పుడూ కొట్టవుగా?" పోతూ సుబ్బడితో అన్నాడు ఆ ఖైదీ.

"ప్రమాణం సేత్తున్నాదొరా! ఇంక లచ్చి వంటిమీద చెయ్యి వెయ్యను. తెలొచ్చింది దొరా! దేవుడల్లే సెప్పారు"

కళ్ళలో కాంతిరేఖలు కదిలిపోతున్న ఖైదీని ఇనుప సువ్వల్లోంచి సాగనంపాడు సుబ్బడు కన్నీళ్ళతో.

పోలీసులు తన్ను వేన్‌లో ఎక్కిస్తూంటే-గుండెలు తరుక్కుపోయేలా ఏడుస్తూ వేన్ వెంట పరిగెత్తుతున్న లచ్చి రూపం కళ్ళలో మెదిలి జుట్టు పీక్కున్నాడు సుబ్బడు.

తెల్లవారింది. సుబ్బడ్ని విడుదల చేశారు. లచ్చి ఏమయిందో నన్న ఆదుర్దాతో బయలుదేరిన సుబ్బడ్ని, అంత వరకూ జైలుకెదెరుగా వున్న చెట్టుక్రిం దపడివున్న లచ్చి, అమాంతంగా కౌగలించుకొని చిన్నపిల్లలా వెక్కి- వెక్కి- ఏడవసాగింది.

సుబ్బన్న లచ్చిని దగ్గరకు తీసుకున్నాడు.

లచ్చి వళ్ళు జ్వరంతో మండిపోతూంది.

లచ్చి తలమీద బడుతున్న సుబ్బడి కన్నీరు ఆవిరై పోతున్నది.

ధర్మదేవత గుడ్డికళ్ళు చెమ్మగిల్లాయి.

—)o(—